క్లుప్తంగా

నవరాత్రులను జయప్రదం చేయండి



ఆలయ ధర్మకర్త లింగారెడ్డి

శ్రీరంగరాజపురం: తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మ నవరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రజలు జయప్రదం చేయాలని ఆలయ ధర్మకర్త లింగారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు ఉత్సవాలు చేపడుతామన్నారు. ప్రతి రోజూ గణపతి హోమం, అభిషేకం, అన్నదానం, రాత్రి వీధినాటకం, తెలుగు సంస్కృతి ఉట్టిపడిలే కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ, ఎంపీపీ సరిత, ఆలయ కమిటీ సభ్యులు, పాయికట్టు ప్రజలు పాల్గొన్నారు.

చెరకు బకాయిలు చెల్లించాలి



చక్కెర పరిశ్రమ వద్ద చెరకు రైతుల ధర్నా

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ సోమవారం ఫ్యాక్టరీ ఆవరణలో రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మట్లాడుతూ రైతులకు ఇవ్వాల్సిన రూ.37 కోట్లు ఇవ్వకుండా ఇతర ఫైనాన్స్ కంపెనీవారికి పరిశ్రమను స్వాధీనం చేయడం దారుణమన్నారు. ఫ్యాక్టరీని ఇతరులకు అప్పగిస్తే రైతులకు బకాయిలు ఎలా చెల్లిస్తారని డిమాండ్ చేశారు. రైతులకు తెలియకుండా ఫ్యాక్టరీలోని వస్తువులు అమ్మరాదని, తరలించరాదని తెలిపారు. చెరకు సరఫరా చేసి ఐదు సంవత్సరాలు గడుస్తున్నా యాజమాన్యం బకాయిలు చెల్లించలేదని, దీంతో పలు సార్లు యజమానిపై కేసులు నమోదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాసులు, మండలంలోని రైతులు పాల్గొన్నారు.

పంట పొలంలో గడ్డికి నిప్పు



జంబాడలో పంట పొలంలో కాలిపోతున్న గడ్డి

విజయపురం: మండలంలోని జంబాడ గ్రామంలో సోమవారం పంట పొలంలో గడ్డికి గుర్తు తెలియన వ్యక్తి నిప్పు పెట్టడంతో కాలిపోయింది. ఇటీవల వరియంత్రంతో పంట నూర్పిండి చేసి, గడ్డిని పొలంలో వదిలిపెట్టారు. గుర్తు తెలియని వ్యక్తి నిప్పు పెట్టడంతో కాలిపోయింది. అయితే గ్రామస్తులు వెంటనే నిప్పును ఆర్పివేయడంతో పక్కన ఉన్న మామిడి తోటలకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

చిట్టిబాబుకు భారత సేవారత్న అవార్డు



బెంగళూరులో భారత సేవారత్న అవార్డు తీసుకుంటున్న చిట్టిబాబు

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మపురం గ్రామానికి చెందిన చిట్టిబాబుకి రాష్ట్ర రూరల్ యాక్షన్ సంస్థ ఆర్గనైజర్, ట్రాయ్ కాగ్ సభ్యుడు పి.చిట్టిబాబుకు సోమరాజు ఫౌండేషన్ సంస్థ భారత సేవారత్న జాతీయ అవార్డు ఇచ్చారని సోమవారం గ్రామ పెద్దలు తెలిపారు. బెంగళూరులో ఫౌండేషన్ చెర్మన్ శివరామరాజు, కేంద్ర న్యాయ శాఖ మంత్రి సెక్రటరీ శివనాగేశ్వరరావు, కర్ణాటక హైకోర్టు ప్రాసిక్యూటర్ రామకృష్ణ ఈ అవార్డును పి.చిట్టిబాబుకు ప్రదానం చేసి, సత్కరించారు. అవార్డు గ్రహీత పి.చిట్టిబాబు రాష్ట్రంలో టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం, గ్రామీణ మహిళ అభ్యున్నతికి చేతి వృత్తులపై శిక్షణ అందించడం, పాఠశాలల్లో పేద విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం, కోవిడ్ సమయంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు న్యూట్రీషియన్ ఫుడ్ అందజేయడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య సమాజ అవిష్కరణకు నడుం బిగించడంతో ఈ అవార్డు లభించిందన్నారు. ఈ అవార్డును అందుకున్న పి.చిట్టిబాబును స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, భూపతి, అమరనాథ్, మునికృష్ణ, సంస్థ సిబ్బంది పద్మావతి, సురేష్, తేజ, రాజకుమారి, షాలిని, హర్షకుమార్ అభినందించారు.

సీట్లు తగ్గితే చాలా నష్టపోతాం



మెడిసిన్‌పై ఎన్నో ఆశలతో చదువుతున్న నాలాంటి విద్యార్థులు ప్రభుత్వ నిర్ణయంతో చాలా నష్టపోతారు. నేను ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాను. నాకు మునుపటి బ్యాచ్‌లో పలువురు డాక్టర్లు కావాలని వేలాది రూపాయలు నగదు, సమయం వెచ్చించి నీట్ కోచింగ్ తీసుకుంటున్నారు. వారిని నేను అనుసరించాలనుకున్నా. ఇప్పుడు ఎంబీబీఎస్ సీట్లు తగ్గితే ఇబ్బంది పడాల్సి వస్తుంది. మంచి ర్యాంక్ వచ్చినా సీటు వస్తుందో రాదోననే భయం ఉంది. మెడికల్ సీట్లు వద్దని రాసిన లేఖను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. – వినయ్, అత్తూరు,



ఆశలు అడియాశలవుతున్నాయి



ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్న పేద విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షలా మారుతోంది. ప్రతి పేద విద్యార్థికి ఉన్నత విద్యను అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేయాలి. అయితే ప్రస్తుత ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసి పేద విద్యార్థుల ఆశలను అడియాశలు చేస్తోంది. మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే వైద్య విద్యను కొనుక్కుని చదువుకునే పరిస్థితి పేద విద్యార్థులకు లేదు. – వాసు, నింద్ర

వ్యాధుల కాలం ▶ అప్రమత్తతే ప్రధానం

- మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి
- దోమలతో అప్రమత్తంగా ఉండాలి
- తగు జాగ్రత్తలు పాటించాలి

విజయపురం: వర్షాకాలం వ్యాధుల బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. దీనికి తోడు గ్రామాల్లో అడుగడుగునా తిష్ట వేసుకున్న పారిశుధ్య సమస్యలు ప్రజలను మరింత భయాందోళనలకు గురిచేస్తున్నాయి. పారిశుధ్యాన్ని మెరుగు పరచడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ఏటా సీజనల్ వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు.

మురుగు నిల్వలే మూలం

ఖాళీ స్థలాలు, ఇళ్ల మధ్య మురుగు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అటువంటి ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేయడం, నీటి నిల్వలను తొలగించడం తదితర చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉన్నచోటే పందులు కూడా సంచరిస్తున్నాయి. వీటితోపాటు ఇంటి పరిసరాల్లో వాడని రోళ్లు, డ్రమ్ములు, పాత వస్తువులు, టైర్లు, డబ్బాలు,



అధ్వానంగా ఉన్న మురుగు కాలువ

కొబ్బరి బోండాల్లో వర్షం నీరు చేరి దోమలు ఆవాసాలుగా మారుతున్నాయి.

దోమలతో జాగ్రత్త

వర్షాకాలంలో ప్రబలే వ్యాధులకు దోమలు, అపరిశుభ్రతే ప్రధాన కారణాలు, దోమల కారణంగా మలేరియా, ఫైలేరియా, డెంగీ, మెదుడు వాపు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా అపరిశుభ్రతతో డయేరియా, టైఫాయిడ్, కామెర్లు తదితర వ్యాధులు సోకుతాయి. డెంగీ, మలేరియా వ్యాప్తికి కారణమయ్యే దోమలు మురుగు నీటిలోనే వృద్ధి చెందుతాయి. ఆవాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటిస్తే దోమల వద్దిని అరికట్టవచ్చు. డయేరియా, టైఫాయిడ్, కామెర్లు అపరిశుభ్రత వాతావరణం, కలుషిత ఆహారం, తాగునీరు మూలంగానే వస్తాయి.

జాగ్రత్తలు పాటించాలి

ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రజలు ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. గ్రామాల్లో వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు ఫీవర్ సర్వే కూడా నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని సూచిస్తున్నాం.
– డాక్టర్ సోమశేఖర్, విజయపురం, పీహెచ్‌సీ

వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి ఆర్‌కే రోజాకు సత్కారం



ఆర్కే రోజాను సన్మానిస్తున్న పుత్తూరు నాయకులు

పుత్తూరు: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజాను పుత్తూరు నాయకులు ఘనంగా సన్మానించారు. సోమవారం నగరిలోని ఆమె నివాసంలో కలిసిన నాయకులు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పదవీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో అభినందనలు తెలియజేశారు. గత పదేళ్లుగా నగరి నియోజకవర్గ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అందించిన సేవలకు గుర్తింపుగా పదవి లభించిందని కొనియాడారు. ఈ సందర్భంగా రోజాకు దుశ్శాలువా కప్పి, గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, పార్టీ నాయకులు మనోహర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, మునెయ్య, చిన్నా, సత్య, ఉదయ్ కుమార్, రాజేష్, కృష్ణ, ముదిరాజు, రమేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

విధేయతకు సత్కారం

నగరి: మాజీ మంత్రి ఆర్కేరోజా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధిగా నియమితులు కావడంపై స్థానిక పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని మాజీ మంత్రి నివాసానికి సోమవారం వెళ్లిన నేతలు రోజాను దుశ్శాలువాలతో సత్కరించారు. అంకితభావంతో పనిచేస్తూ పార్టీ కార్యకర్తలకు నాయకులకు అందుబాటులో ఉంటూ పదేళ్లుగా నగరి నియోజకవర్గ ప్రజలకు సేవలు చేసినందుకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. రోజా మాట్లాడుతూ జగనన్న తనకు ఇచ్చిన బాధ్యతను తప్పకుండా నెరవేరుస్తానన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి ఆర్కే రోజాను సత్కరిస్తున్న నేతలు

వైభవంగా సప్త కన్నికలమ్మ పూజలు



ఎల్లమ్మరాజుపల్లె గుట్టవద్ద సప్త కన్నికలమ్మకు పూజలు

గంగాధరనెల్లూరు: మండలంలోని ఎల్లమ్మరాజుపల్లె గుట్టలో సప్త కన్నికలమ్మకు గ్రామస్తుల ఆధ్వర్యంలో పూజలు వైభవంగా నిర్వహించారు. గంగాధరనెల్లూరు మండలం పెద్ద కాల్వ పంచాయతీ ఎల్లమ్మరాజుపల్లె, బట్టు కండిగ, టానా గ్రామానికి చెందిన ప్రజలు 30 ఏళ్లుగా కనికలమ్మ పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఎల్లమ్మరాజుపల్లె గ్రామస్తులతో పెద్ద కాలువ పంచాయతీకి చెందిన ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి మహిళలు పొంగళ్లతో ఏనుగులు, గుర్రాల బొమ్మలతో పురుషులు తల మీద పెట్టుకొని పంబ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగింపుగా తరలివచ్చారు. ఈ సందర్భంగా సప్త కన్నికలమ్మకు మహిళలు పొంగళ్లు పెట్టగా పురుషులు సప్త కన్నికలమ్మ విగ్రహాలకు అదే విధంగా ఏనుగులు, గుర్రాలకు పూజలు చేసి, పంబ వాయిద్యాల నడుమ పూజలు వేడుకలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న గ్రామస్తులు ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

నింద్ర: ముస్లింలకు పవిత్రమైన మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భం మసీదులలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా ఆయన బోధించిన నీతి సూత్రాలను అనుసరించడంతో ఎంతో అబివృద్ధి సాధంచవచ్చునని అన్నారు. ముస్లింలంతా ఆయన మత సూక్తులను అనుసరించాలని కోరారు.

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

విజయపురం: కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన విజయపురం మండలం చిన్నమహావీరపురంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చిన్న మహావీరపురం గ్రామానికి చెందిన నాగరాజు(41)కు కొద్ది నెలలుగా కడుపునొప్పి వస్తోంది. ఎన్ని ఆసుపత్రులలో చూపించినా నొప్పి తగ్గలేదు. ఆదివారం రాత్రి నొప్పి తీవ్రమవడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగేశాడు. నిద్రలో నుంచి మేలుకున్న తల్లి కుమారుడు మందు తాగి పడి ఉన్నాడని గ్రహించి, వెంటనే నగరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అమ్మ శారద ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ గోవిందరాజులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా బకాసుర బలి బండి



తవణంపల్లెలో అట్టహాసంగా బకాసుర బలి బండి

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల దేవస్థానంలో జరుగుతున్న 119 ఏళ్ల మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా సోమవారం బకాసుర బలి బండి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ద్రౌపదీ దేవి, ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల, సహదేవల విగ్రహాలకు అర్చకులు అభిషేకం, పూజలు చేపట్టారు. అనంతరం బకాసురుడికి ఆహారం తీసుకురావడానికి ఏర్పాటు చేసిన బండిని అందంగా తీర్చిదిద్దారు. భీముడు వేషధారి మణి బండి అధిరోహించి తవణంపల్లె, ఎగువతవణంపల్లె, మిట్టపల్లె, గోనేపల్లె, కక్కలమిట్ట తదితర గ్రామాల్లో బండిలో తిరిగి ఆహారాన్ని సేకరించారు.

ఆకట్టుకున్న హరికథా గానం..

మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం భాగవతారిణి స్వర్ణలత బకాసుర వధ గురించి గానం చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని హరికథను శ్రద్ధగా విన్నారు. అనంతరం దాతలచే గుడికి విరాళంగా ఇచ్చిన బండిన అందంగా తయారుచేసిన కోదండ ఆచారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

ఘనంగా రాహుకేతు పూజలు



బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీకామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి మూలవర్లకు ఉదయం అభిషేకాలు, పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. ప్రత్యేక పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకున్నారు. అనంతరం మొగిలీశ్వరస్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వారిచే భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్

తవణంపల్లె: మండలంలో అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ చిరంజీవి హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఎగువమత్యంకు చెందిన ప్రజ్వల్ అనే అతను అధికారుల అనుమతి లేకుండా వంకలోని ఇసుకను ట్రాక్టర్‌కు లోడు చేసి తరలిస్తుండగా పట్టుకున్నట్లు వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన రీచ్‌ల్లో మాత్రమే ఇసుకను తరలించాలని సూచించారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్వాధీనం చేసుకుని ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఇసుక అక్రమాలకు అడ్డా

- కంటైనర్లతో జీడీనెల్లూరు టూ .... చెన్నై
- కోట్లు గడిస్తున్న కూటమి నాయకులు
- కన్నెత్తి చూడని పోలీస్ అధికారులు
- రాష్ట్ర స్థాయి నాయకుల కనుసన్నల్లో అక్రమ వ్యాపారాలు



ఇసుకతో పట్టుబడిన లారీ

కార్వేటినగరం: ఇసుక అక్రమాలకు అడ్డాగా గంగాధరనెల్లూరు నీవానది నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నియోజకవర్గంలో ఇసుక, గ్రావెల్ యథేచ్ఛగా తమిళనాడు సరిహద్దులు దాటించేస్తున్నారు. టీడీపీ నాయకులు తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరుకాయలుగా కొనసాగిస్తున్నారు. నీవానదిని అక్రమ వ్యాపారాలకు నిలయంగా మారుస్తున్నారు. సామాన్యులకు అందని ద్రాక్షలా ఉంటున్న ఇసుక తమిళనాడుకు పుష్కలంగా తరలి పోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. జిల్లా అధికారులు మాత్రం స్థానికులకు ఇసుక కొరత లేకుండా చూడాలని ఆదేశించినా అధికార పార్టీ నాయకులు అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి మంత్రులు, ముఖ్య నాయకుల అండదండలతో ఓ వర్గం ప్రతి రోజూ రాత్రికి రాత్రే కంటైనర్లతో జీడీనెల్లూరు మండలం నుంచి తమిళనాడు సరిహద్దులు దాటించి చెన్నైకి చేరవేస్తూ కోట్లకు కోట్లు గడిస్తున్నారు. అడ్డుపడిన అధికారులకు బెదిరింపులు తప్పడం లేదు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తి గత ప్రభుత్వంలో వలంటీర్‌గా పని చేసిన పాపానికి నీవానదిలో ఉన్న ఖాళీ ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే ఉన్నత సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తికి సంబంధించిన లక్షల విలువ జేసే 50 టన్నుల ఇసుకను పోలీసులు వదిలేశారు. అదుపులోకి తీసుకుని టీడీపీ నాయకుల ఆదేశాలతో తూతూ మంత్రంగా జరిమానా విధించి కనీసం కేసు కూడా నమోదు చేయకుండా పంపించేశారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారు అక్రమాలు చేసినా పట్టించుకోవడం లేదని, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు చిన్నతప్పు చేసినా వారిపై పోలీసులు కన్నెర్ర చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కొంత మంది వ్యవసాయానికి ట్రాక్టర్లను కొనుగోలు చేసి అధికార పార్టీని అడ్డుపెట్టుకుని కనీసం రికార్డులు కూడా సక్రమంగా లేకుండా ఇసుక దందాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి అధికార పార్టీకి తలవంచకుండా అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన కంటైనర్, అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

చిన్నారుల జీవితాలను నులిపురుగులు నులిమేస్తున్నాయి. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. పిల్లల్లో అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతున్న నులిపురుగులను కేవలం ఒకే మాత్ర ఆల్బెండజోల్‌తో నివారించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుంచి గంగాధరనెల్లూరు నియోజకవర్గ వ్యాప్తంగా ఉచితంగా 24,649 మందికి నులిపురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనుంది. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

– పాలసముద్రం



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న డాక్టర్ (ఫైల్)

- నేడు నులి పురుగుల నివారణ దినోత్సవం
- 19 ఏళ్లలోపు వారు మాత్రమే వాడాలి

అపరిశుభ్రతతోనే నులిపురుగులు ఎక్కువగా వ్యాపిస్తాయి. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించని పిల్లలకు నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది. పిల్లలు ఎప్పుడూ చేతిగోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. గోళ్లు పెరిగినప్పుడు వెంటనే కత్తిరించుకోవాలి. లేకుంటే వాటిలో పేరుకున్న మట్టి ద్వారా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. కలుషిత నీరు తాగడం, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జనతో కూడా నులిపురుగులు మన శరీరంలోకి చేరుతాయి. కూరగాయలను కడగకపోవడం, భోజనం చేసే ముందు చేతులు కడుక్కోకపోవడం, ఆహార పదార్థాలపై మూతలు లేకపోవటంతో నులిపురుగుల ప్రభావం ఉంటుంది.

రక్షణ కోసం...

బహిరంగ ప్రదేశాల్లో మల మూత్ర విసర్జన చేయకూడదు. మల విసర్జన తరువాత, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. కాళ్లకు చెప్పులు లేదా బూట్లు ధరించాలి, పెరిగిన గోళ్లు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. పరిశుభ్రమైన నీటిని తాగాలి, పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తర్వాత మాత్రమే వినియోగించాలి.

మండలాల వారీగా విద్యార్థుల సంఖ్య	
గంగాధరనెల్లూరు	6099
శ్రీరంగరాజపురం	3139
కార్వేటినగరం	6818
వెదురుకుప్పం	5279
పెనుమూరు	5861
పాలసముద్రం	3214
మొత్తం	24649

ఇవీ అనర్థాలు

నులిపునుగులు చిన్నారుల్లో రక్తహీనతకు దారితీస్తాయి. శారీరక, మానసిక ఎదుగుదలకు ఆటంకంగా మారుతాయి. కడుపులో చేరి నొప్పి, మంట, వికారం కలుగుజేస్తాయి. దీనివల్ల ఆహారం సహించదు. ఆకలి ఉండదు. పిల్లలు నీరసపడతారు. శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. వాంతులు, మలంలో రక్తం, అతిసారం వంటి సమస్యలు ప్రబలుతాయి. ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లల్లో నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది.

ఇలా నివారించవచ్చు



పిల్లల్లో మూడు రకాల పురుగులు ఉండే అవకాశం ఉంది. అవి ఏలిక పాములు, నులిపురుగులు, కొంకిపురుగులు. వీటిని నిర్మూలించేందుకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవాలి. మాత్రను భోజనం తర్వాత తీసుకోవాలి. మాత్ర వేసుకున్న ఒకరోజు లేదా రెండు రోజుల్లో నులిపురుగులు ఉన్నట్లయితే మలవిసర్జన ద్వారా బయటకు వెళ్లిపోతాయి. – డాక్టర్ మోహన్‌క్రిష్ణ, వైద్యాధికారి, పాలసముద్రం

వైద్య సిబ్బంది పర్యవేక్షించాలి



ఏడాది నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్రను 200 మిల్లీగ్రాముల నీళ్లలో కలిపి పట్టించాలి. 2 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలు 400 మిల్లీగ్రాముల మాత్రను మధ్యాహ్నం భోజనం తరువాత చప్పరించేలా చూడాలి. పాఠశాలల్లో బోధన సిబ్బంది. వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఆల్బెండజోల్ మాత్రలు నమిలి మింగించేలా చూడాలి. – వినితాశ్రీ, గంగాధరనెల్లూరు ప్రాజెక్టు, సీడీపీఓ

19 ఏళ్లలోపు వారికే మాత్రలు పంపిణీ



గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ప్రభుత్వం ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారు మొత్తం 24,649 మంది పిల్లలున్నారు. వీరందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తాం. నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మాత్రలను మింగని వారికి ఈ నెల 16న స్పెషల్ డ్రైవ్ పెట్టి మాత్రలు మింగేలా చూస్తాం. – డాక్టర్ లోకేష్, వైద్యాధికారి, పాలసముద్రం